# తన ప్రజలకు బోధించడానికి దేవుడు యెషయాను సిద్ధపర్చాడు

## పరలోకంలోకి చూడగలిగిన ప్రవక్త, యెషయా

**ప్రార్థన :** “ప్రియమైన ప్రభువా, ప్రవక్తయైన యెషయావలె మేము కూడా నీ మహాత్మ్యాన్ని మరియు నీ పరిశుద్ధతను చూడడానికి సహాయం చేయి. అతనివలె మేము కూడా నీ యెదుట మమ్మల్ని మేము నమ్రతతో తగ్గించుకోవడానికి, నీ శుద్దీకరణకు తలవంచడానికి సహాయం చేయి. నీవప్పగించే పరిచర్యను చేయడానికి సహాయం చేయి.

పిల్లల అవసరతలకు మరియు వయసుకు తగిన అభ్యాస క్రియలను ఈ క్రింది వాటి నుండి ఎన్నుకోండి.

**యెషయా 6:1–8**లో దేవుడు యెషయాకు అనుగ్రహించిన పరలోక దర్శనం మరియు ఇశ్రాయేలీయులకు దేవుని వాక్యాన్ని బోధించడానికి అతన్ని పంపిన విధానం గూర్చి చెప్పండి లేదా చదివి వినిపించండి.

ఈ **ప్రశ్నలడగండి** *(ప్రతి ప్రశ్న తర్వాత జవాబు సూచించబడింది)*

- యెషయా దేవున్ని ఎక్కడ చూశాడు? *(1వ వచనం)*
- దేవుని పైగా ఎవరు ఎగురుతున్నారు? *(3వ వచనం: సెరాపులు సెరాపులు అంటే దేవదూతలు)*
- సెరాపులు ఏమని అరుస్తున్నారు? *(3వ వచనం)*
- దేవదూతలు పాడి కీర్తించినప్పుడు దేవాలయానికి ఏం జరిగింది? *(4వ వచనం)*
- అది జరిగినప్పుడు యెషయాకేమనిపించింది? *(5వ వచనం)*



- యెషయా ఎందుకు భయపడ్డాడు? *(5వ వచనం)*
- యెషయా తన పెదవులను ఎలా పవిత్రపర్చుకొన్నాడు? *(6–7 వచనాలు)*
- దేవదూత యెషయాతో ఏం చెప్పాడు? *(7వ వచనం)*
- దేవుడు యెషయాను ఏం అడిగాడు? *(8వ వచనం)*
- యెషయా ఏమని బదులిచ్చాడు? *(8వ వచనం)*
- దేవుడు యెషయా విషయంలో చేసినట్టుగా మనలను కూడా శుద్దీకరించి మన పాపాలను క్షమించవల్సిన అవసరం ఉన్నదా?
- ప్రజలందరికి తన్ను గూర్చి బోధించడానికి ఎవరిని పంపాలా అని దేవుడడిగితే మనమేం జవాబివ్వాలి?

దేవునివాక్యం బోధించడానికి యెషయాను దేవుడేవిధంగా సిద్ధపర్చాడో తెలిపే కథను నాటికగా ప్రదర్శించండి (యెషయా 6:1–8)

- ఆరాధన నడిపించే ముఖ్యనాయకున్ని సంప్రదించి ఈ నాటికను పిల్లలు ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయండి.
- మీ బోధనా సమయాన్ని నాటికను సిద్ధపర్చడం కొరకు పిల్లలతో గడపండి.
- కథలోని అన్ని విషయాలు ప్రదర్శించనవసరంలేదు.
- పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు సహాయపడేలా చూడండి.
- పెద్ద పిల్లలు లేదా పెద్దవారుయెషయా, దేవుని స్వరం మరియు కథకుని పాత్రలు ధరించాలి. కథకుడు కథను సంక్షిప్తంగా చెప్పి పిల్లలు ఎప్పుడు, ఏమి చెప్పాలో జ్ఞాపకం చేయాలి.
- చిన్న పిల్లలు సెరాపుల (మహాదూతల) పాత్రలు ధరించాలి. ఎర్రగా మండుతున్న అగ్నిని సూచించే దేనినైనా వారు తయారు చేయాలి.

## మొదటి భాగం

**కథకుడు :** యెషయా 6:1–7 నుండి కథలోని మొదటి భాగం చెప్పాలి. తర్వాత “యెషయా ఏమంటున్నాడో వినండి” అనాలి.

**యెషయా :** చేతులతో కళ్ళు మూసుకొని ఇలా గట్టిగా చెప్పాలి. “నేను పరిశుద్ధ దేవాలయంలో దేవున్ని చూస్తున్నాను. ఆయన మహిమ అంతటా ఆవరించి ఉంది మహాదూతలు ఆయన సింహాసనం చుట్టూ ఎగురుతున్నారు. దేవాలయం కంపిస్తున్నది, ధూమంతో నిండిపోతున్నది. అది నన్ను భయకంపితున్ని చేస్తున్నది. ఎందుకంటే నేనెంతో పాపాత్మున్ని.!

**కథకుడు :** ఆ మహాదూతలు ఏమి పాడుతున్నారో వినండి.

**సెరాపులు :** (అబ్బాయి) ఇలా పాడాలి లేదా వల్లించాలి.
సైన్యములకధిపతియైన దేవుడు పరిశుద్ధుడు! పరిశుద్ధుడు, పరిశుద్ధుడు.

**సెరాపులు :** (అమ్మాయి) లోకమంతా ఆయన మహిమతో నిండి ఉంది.
(దేవుని పరిశుద్ధతను వర్ణించే ఒక పాటను పిల్లలంతా పాడేలా సిద్ధపర్చవచ్చు)

**యెషయా :** ప్రభువా నేను అపవిత్రున్ని! నా ప్రజలంతా పాపులే. నేను నీ సన్నిధిలో నిలువడానికి అర్హున్నికాదు.

**సెరాపులలో ఒకరు :** చేతిలో నిప్పుతో యెషయా వద్దకు ఎగురుతూ వచ్చినట్టుగా రావాలి. ఆ నిప్పుతో అతని నోటిని తాకాలి “దేవుడు నిన్ను క్షమించాడు. నీ పాపం నుండి ఆయన నిన్ను పవిత్రపర్చాడు నీవిప్పుడు పవిత్రుడవయ్యావు.

## రెండవ భాగం

**కథకుడు :** 8వ వచనం ఆధారంగా కథలోని రెండవ భాగం చెప్పాలి. ఆ తర్వాత “దేవుడేమంటున్నాడో వినండి” అనాలి.

**దేవుని స్వరం :** నాకొక సందేశకుడు కావాలి. నా పక్షాన ప్రజల వద్దకు వెళ్ళి ఎవరు బోధిస్తారు?

**యెషయా :** నేనున్నాను ప్రభువా! నన్ను పంపించు.

**కథకుడు :** నాటిక ప్రదర్శనలో సహాయపడిన వారందరికి కృతజ్ఞతలు తెలుపాలి.

**ప్రశ్నలు :** ఒకవేళ పిల్లలు ఈ నాటికను పెద్దల కొరకు ప్రదర్శించినట్టయితే, పైన ఇవ్వబడిన ప్రశ్నలను కూడా వారు పెద్ద వారిని అడగవచ్చు.

**అభ్యాసం (ప్రయోగం) :** ఒక పెన్సిల్, పేపర్ మరియు అగ్గిపెట్టె సిద్ధంగా ఉంచండి. పిల్లలనిలా అడగండి.

- ఏ విషయాలు దేవుని ముందు మనలను అపవిత్రులనుగా నిలబెడతాయి? పిల్లలు చెప్పిన విషయాలన్నింటిని కాగితంపై వ్రాయండి.

- మన పాపాన్ని మనం ఎలా వదిలించుకోగలం? పై కాగితాన్ని కాల్చేయండి. దేవుడు మన పాపాలను తొలగించగలడని వివరించండి.

  **అడగండి :** పరలోకంలో సెరాపులు లేదా మహాదూతలవలె మనం కూడ ఆయన పరిశుద్ధతను మరియు మహాత్మ్యాన్ని వివరిస్తూ ఏ పాటలు పాడతామో చెప్పమని పిల్లలను అడగండి. (పిల్లలు వారికి తెలిసిన పాటలు చెప్పి పాడేలా చూడండి)

  **గీయండి :** మండుతున్న కొలిమి పటాన్ని గీయండి. పిల్లలు ఆ పటాన్ని చూస్తూ గీయాలి మరియు ఆ పటాలను ఆరాధన సమయంలో పెద్దలకు చూపించి, దేవుడెంత పరిశుద్ధుడో, ఎంత నిష్కల్మషుడో ఆ పటాలు చూపిస్తున్నాయనీ అగ్ని బంగారాన్ని శుద్ధిచేసినట్టుగా ఆయన మన పాపాలను శుద్ధిచేస్తాడని ఆ పటాలు వివరిస్తాయని చెప్పాలి.



**కంఠత వాక్యం :** కీర్తన 51:10

**కవిత :** కీర్తన 63:1–3 నుండి ముగ్గురు పిల్లలు ఒక్కొక్కరు ఒక్కొక్క వచనం చొప్పున కంఠత చెప్పాలి.

దేవా, నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదకుదును.
    నీ బలమును నీ ప్రభావమును చూడవలెనని
    పరిశుద్ధాలయమందు నేనెంతో ఆశతో నీతట్టు కనిపెట్టియున్నాను.
నీళ్లు లేకయెండియున్న దేశమందు నా ప్రాణము నీకొరకు తృష్ణగొనియున్నది
    నీమీది ఆశచేత నిన్ను చూడవలెనని నా శరీరము కృశించుచున్నది.
నీ కృప జీవముకంటె ఉత్తమము
    నా పెదవులు స్తుతించును.

దేవుని పరిశుద్ధతను వివరిస్తూ పెద్ద పిల్లలు ఒక పాటనుగానీ లేదా పద్యాన్ని గానీ లేదా చిన్న నాటికను గానీ వ్రాయాలి. ఆయనను పరలోకంలోని మహాదూతలు ఎలా స్తుతిస్తారో, ఆయన మనలనెలా పవిత్రపరుస్తాడో వివరించాలి.

**ప్రార్థన :** ప్రభువా, యెషయావలె మేము కూడ నీ పరిశుద్ధతను మరియు మహాత్మ్యాన్ని ప్రస్తుతిస్తున్నాము మహాదూతలు నిన్నారాధిస్తారు. మేము కూడ వారితో కలిసి “పరిశుద్ధుడా! పరిశుద్ధుడా! పరిశుద్ధుడా! అని నిన్నారాధించాలని కోరుతున్నాం. నీ పరిశుద్ధత మేమెంత పాపులమో తెలియజేస్తుంది. మమ్మల్ని క్షమించి పవిత్రులనుగా చేయి. యేసు నామంలో వేడుకొంటున్నాం”.

Copyright © 2004 by Paul-Timothy. May be freely copied. Download from www.Paul-Timothy.net